

నామినేషన్ పత్రాలతో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు

# వచ్చేది బీఆర్ఎస్సే..

- సంక్షేమ పథకాలే వెంకట్రావును గెలిపిస్తాయి
- ఇతర పార్టీలను ప్రజలు గ్రామాల్లోకి రానివ్వడం లేదు
- తెలంగాణలో కాంగ్రెస్‌కు అధికారం కలే
- ఎమ్మెల్సీ ఇన్‌చార్జి తాతా మధుసూదన్
- భద్రాచలం అభ్యర్థిగా నామినేషన్ వేసిన తెల్లం

భద్రాచలం, నవంబర్ 9 : రాష్ట్రంలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్ అన్నారు. గురువారం సీతారామ చంద్రస్వామివారి ఆలయానికి తెల్లం వెళ్లి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా వచ్చారు. ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి అభ్యర్థి తెల్లం వెంకట్రావు రిటర్నింగ్ అధికారి మంగీలాల్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. వెంకట్రావును భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తరువాత గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం వరకు కార్యకర్తలు ఆయన గెలుపునకు కృషి చేస్తున్నారన్నారు. కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్‌కే ఓటేస్తామని, వేరే పార్టీలను ఊళ్లకు రానీయమని ప్రజలు స్పష్టంగా చెప్తున్నారన్నారు. త్వరలోనే ఆ గ్రామాల పేర్లు వెల్లడిస్తానన్నారు. గతంలో జరిగిన పొరపాటు మళ్లీ జరుగనీయమన్నారు. మాకు అభివృద్ధి కావాలని వ్యాపారులు, రైతులు, కూలీలు, గిరిజనులు, దళితులు ఏకపక్షంగా చెప్తున్నారన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, ప్రత్యేకంగా భద్రాచలం నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు తనతో చెప్పారన్నారు. జాతీయ స్థాయిలో సర్వేలు బీఆర్ఎస్‌దే గెలుపు అని చెప్తున్నాయన్నారు. కాంగ్రెస్ కర్ణాటకలో గెలిచిందని, ఆ జోష్ తెలంగాణలో కూడా ఉంటుందని ఆశ పడుతోందని, అవన్నీ ఇక్కడ సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ నుంచి భారీగా బీఆర్ఎస్‌లోకి వలసలు ఉన్నాయని, వారం, పదిరోజుల్లో ఇంకా చాలా మంది వస్తారన్నారు. కార్యక్రమంలో చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, తాండ్ర వెంకటరమణారావు, గంటా కృష్ణ, ఎండీ నవాబ్, మానె రామకృష్ణ, బోదెబోయిన బుచ్చయ్య పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరినవారితో ములుగు అభ్యర్థి నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి

# బీఆర్ఎస్‌లో చేరిన గోపాలపురం ఉప సర్పంచ్

ములుగురూరల్, నవంబర్ 9 : కొత్తగూడెం మండలం గోపాలపురం గ్రామ ఉప సర్పంచ్ గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, మండల ఎన్నికల ఇన్‌చార్జి సతీశ్‌రెడ్డి.. కాంగ్రెస్‌కు చెందిన కల్తి రత్న సారంగపాణికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ చేరినట్లు తెలిపారు. సీతక్క ఎమ్మెల్యేగా తమ గ్రామ అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి నాగజ్యోతిని గెలిపించుకొని గ్రామ అభివృద్ధికి పాటు పడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు అజ్మీరా ధరమ్‌సింగ్, భూక్యా దేవ్‌సింగ్, గోపాలపురం సర్పంచ్ సోయమ్మ, పార్టీ గ్రామ అధ్యక్షుడు సంపత్, నాయకులు భూక్య సాంబలక్ష్మి, దాసం పాపయ్య, మేడ వినిత్, నరేశ్ పాల్గొన్నారు.



భూపాలపల్లిలో గండ్ర నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు



నామినేషన్ పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

# తెలంగాణపై కాంగ్రెస్ కపట ప్రేమ

- ఆ పార్టీ రాష్ట్ర పార్టీనా.. జాతీయ పార్టీనా?
- ఇక్కడి ఆరు హామీలు దేశానికి వర్తించవా ?
- రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- సీఎం కేసీఆర్ సహకారంతో మారిన భూపాలపల్లి రూపురేఖలు
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి
- ఇరువురు నా రెండు కళ్లు
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- భూపాలపల్లి అభ్యర్థిగా గండ్ర నామినేషన్
- భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు



జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, పక్కన మంత్రి సత్యవతి, ఎమ్మెల్సీ సిరికొండ, జడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణపై కాంగ్రెస్ కపట ప్రేమ కనబరుస్తున్నదని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గురువారం భూపాలపల్లి అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి నామినేషన్ వేయగా మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా కొంత మంది నాయకులు, కార్యకర్తలతోనే నామినేషన్ వేస్తానని ఎమ్మెల్యే గండ్ర ప్రకటించినప్పటికీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరాగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం నుంచి రిటర్నింగ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జయశంకర్ చౌక్‌లో జరిగిన ప్రచారంలో మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడారు. ఆరు హామీలతో కాంగ్రెస్ తెలంగాణలో ప్రచారం నిర్వహిస్తున్నదని, ఈ హామీలు కేవలం తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే వర్తిస్తాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా అమలు చేయని హామీలను తెలంగాణలోనే అమలు చేస్తారా? కాంగ్రెస్ రాష్ట్ర పార్టీనా.. జాతీయ పార్టీనా.. సిగ్గు, శరం ఉందా... అని మండిపడ్డారు. భూపాలపల్లిలో సిరికొండ మధుసూదనాచారి, గండ్ర వెంకటరమణారెడ్డి కలిస్తే అభివృద్ధికి అడ్డు ఉండదన్నారు. సిరికొండ మధుసూదనాచారి సీఎం కేసీఆర్‌కు కుడి భుజం అన్నారు. తొలి శాసన సభాపతిగా శాసనసభకు వన్నె తెచ్చాడని, ఎమ్మెల్యేగా భూపాలపల్లిని అభివృద్ధి పథంలో నడిపించగా అనంతరం రమణారెడ్డి మరింత ముందుకు తీసుకుపోయారన్నారు. సీఎం కేసీఆర్ భూపాలపల్లిపై ప్రత్యేక ప్రేమ కనబరుస్తున్నారని, ఈ జిల్లాకు తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టారన్నారు.

### కార్యకర్తలు నాకు రెండు కళ్లు

*– ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి*

మధుసూదనాచారి నాయకత్వంలో పనిచేసిన కార్యకర్తలు, రమణారెడ్డి నాయకత్వంలో పనిచేసిన కార్యకర్తలు ఇరువురు నా రెండు కళ్లు అని, వారిని కంటికి రెప్పలా చూసుకుంటానని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ ఎన్నికలు భూపాలపల్లి భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేవి అన్నారు. మన రాష్ట్ర పథకాలను స్టడీ చేసి ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారంటే సీఎం కేసీఆర్ పనితీరుకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య, ఆయా మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీఎం సహకారంతో అభివృద్ధి

– ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

భూపాలపల్లి అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపారని, ఈ క్రమంలోనే భూపాలపల్లి రూపురేఖలు మారాయని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమన్నారు. ఆయన వాక్కు నాకు వేద వాక్కు అన్నారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇద్దామన్నారు. తాను ఎమ్మెల్యే, స్పీకర్‌గా భూపాలపల్లిని అభివృద్ధిలో అగ్రభాగంలో నిలిపానని, అది నా గొప్పతనం కాదని, సీఎం కేసీఆర్ సహకారమేనన్నారు. భూపాలపల్లిలో మన అభ్యర్థిని గెలిపించుకోవడం ద్వారా సీఎం కేసీఆర్ సీఎం అవుతారని, ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ అభ్యర్థి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మనందరి లక్ష్యం కేసీఆర్ సీఎం కావడమనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ 20 రోజులు ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని పనిచేసి సీఎం విశ్వాసాన్ని చూరగొందామన్నారు. భూపాలపల్లి అభివృద్ధిలో నా భాగస్వామ్యం ఉంటుందని, నా జీవితం బీఆర్ఎస్‌కే అంకితమని, నా శక్తి భూపాలపల్లికే అంకితమని అన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- నారాయణగిరిపల్లి గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం

వెంకటాపూర్, నవంబర్ 9 : రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారాయణగిరిపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ ఆశాడపు దేవేందర్ అధ్యక్షతన, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పోచంపల్లి మండల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు, 50 యాదవ, కురుమ, 20 దళిత కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని, ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ప్రజలు నమ్మేది బీఆర్ఎస్‌ను మాత్రమే అన్నారు. ములుగులో గులాబీ జెండా ఎగురవేస్తామని, నాగజ్యోతిపై పోటీ అంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలును కట్టేసినట్టే అనిఅన్నారు. ములుగు నియోజకవర్గం, నారాయణగిరిపల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహిళలు, యువతకు ఉపాధి కల్పించేందుకు టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగన్మోహన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొంతం రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాసర్ల కుమారస్వామి, మండల మాజీ అధ్యక్షుడు కూరెళ్ల రామాచారి, సీనియర్ నాయకులు మందల శ్రీధర్‌రెడ్డి, బుర్ర సమ్మయ్యగౌడ్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి